పన్నుల వసూలుకు బ్రేక్!

- ఇంటి పన్ను రూ.40 లక్షలు, కొళాయి పన్ను రూ. 20 లక్షల బకాయిలు
- గత ఎన్నికల్లో లబ్ధి కోసం టీడీపీ నాయకుల పన్నాగం
- గన్నెవారిపల్లి పంచాయతీలో సమస్యల తిష్ట


గన్నెవారిపల్లి పంచాయతీ సర్పంచ్ కార్యాలయం


కాలనీలో పేరుకుపోయిన మురుగు

తాడిపత్రి రూరల్: గన్నెవారిపల్లి పంచాయతీలో టీడీపీ నాయకుల మద్దతుతో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో దాదాపు రూ. 60 లక్షలకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. సర్పంచ్ టీడీపీ మద్దతుదారుడు కావడంతో ఆ పార్టీ నాయకులు పంచాయతీని గుప్పిట్లో ఉంచుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి లబ్ధి చేకూర్చడానికి పంచాయతీ ఆదాయాన్ని పణంగా పెట్టారు. పంచాయతీ పరిధి లో 4,000కు పైగా ఇళ్లు, అపార్టుమెంట్లు, విల్లాలు, వ్యాపార దుకాణాలున్నాయి. 3,500కు పైగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో దాదాపు 14,419కు ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లను టీడీపీ వైపు తిప్పుకునేందుకు ఇంటి, కొళాయి పన్నులను అస్త్రంగా ఉపయోగించారు. ఈ ఏడాది పన్నులు వసులు చేయడం లేదని ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించారు. తద్వారా పంచాయతీకి పన్నుల రూపంలో దాదాపు రూ. 60 లక్షల వరకూ గండిపడింది.

బిల్లు పుస్తకాలను ప్రింట్ చేయని సిబ్బంది

ఇంటి, కొళాయిలకు సంబంధించి పన్నుల వసులు సంబంధించి పంచాయతీ అధికారులు బిల్లు పుస్తకాలను కూడా ప్రింట్ చేయలేదు. బిల్లు బుక్‌లను ఎందుకు ప్రింట్ చేయలేదని సిబ్బందిని ఎంపీడీఓ కూడా ప్రశ్నించలేదంటే ఏ స్థాయిలో మేనేజ్ జరిగిందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా నిర్మించిన ఇళ్లు, విల్లాలు తదితర బిల్డింగ్‌లకు కూడా ఇంటి, కొళాయి పన్నులను వేయలేదు. వాటికి సంబంధించిన బిల్డింగ్ లైసెన్స్, కొళాయిలను వేయుటకు డిపాజిట్‌లను సైతం అధికారికంగా వసూలు చేసినట్టు పూర్తి స్థాయిలో రికార్డులు కూడా లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీ కంటే వేగంగా అభివృద్ధి

తాడిపత్రి మున్సిపాలిటీలో గన్నెవారిపల్లి పంచాయతీలోని గన్నెవారిపల్లి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం తాడిపత్రి అభివృద్ధి అంతా గన్నెవారిపల్లి కాలనీలోని కడప రోడ్డు వైపు జరుగుతోంది. అంతర్ జిల్లా రోడ్డు అయిన తాడిపత్రి – కడప రోడ్డుతో పాటు అనంతపురం– అమరావతి రోడ్డు, నేషనల్ హైవే 544డీ రోడ్డు కూడా పంచాయతీలోని కడప రోడ్డు వైపు వెళుతుండటంతో స్థలాలకు విపరీతమైన గిరాకీ వచ్చింది. గన్నెవారిపల్లి కాలనీలోని కడప రోడ్డుకు ఇరువైపుల విల్లాలు, అపార్ట్‌మెంట్లు, వివిధ కంపెనీలకు చెందిన డీలర్లు, ప్రైవేట్ ఆస్పత్రులు, వ్యాపార దుకాణాలు, హోటళ్లు, ప్రైవేట్ కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలలు విస్తరించాయి. పట్టణంలో కలిసి పోవడంతో మున్సిపాలిటీ కంటే బిల్డింగ్ లైసెన్స్‌లు, ఇంటి పన్నులు, కొళాయి పన్నులు తదితర ఖర్చులు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది గన్నెవారిపల్లి కాలనీలో స్థిరపడుతున్నారు. అలాగే సమీపంలో వైఎస్సార్ జిల్లా సరిహద్దు ఉండటం, గండికోట ప్రాజెక్టు వల్ల వివిధ గ్రామాల ప్రజలు నిరాశ్రయులు కావడంతో.. వీరంతా వలస వచ్చి గన్నెవారిపల్లి కాలనీలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు.

చేతి ఖర్చుల పేరుతో దోపిడీ..

పంచాయతీ సిబ్బంది అధికారికంగా ఇంటి, కొళాయి పన్నులను వసూలు చేయలేదు. బిల్డింగ్ లైసెన్స్‌లు, కొత్తగా కొళాయి కనెక్షన్ల డిపాజిట్లు పూర్తి స్థాయిలో పంచాయతీ అకౌంట్‌లో జమ కాలేదని ప్రచారం ఉంది. కానీ కొందరు సిబ్బంది మాత్రం అనధికారికంగా చిలక్కొట్టుడు అన్నట్టు వాటి పేరు మీద భారీగా డబ్బులు వసులు చేశారన్న విమర్శలు ఉన్నాయి. ప్రజల నుంచి అధికారికంగా వసూలు చేయకూడదని టీడీపీ నాయకుల నిర్ణయం కింది స్థాయి సిబ్బంది చేతి వాటానికి అవకాశం ఏర్పడింది.

రెండేళ్ల పన్నులు వసులు చేసేందుకు సిద్ధం

ఎన్నికల్లో లబ్ధి పొందడానికి గత 2023–24 సంవత్సరానికి పన్నులు వసులు చేయని అధికార యంత్రాంగం ఆ ఏడాదితో పాటు 2024–25 సంవత్సరానికి కలిపి రెండు సంవత్సరాల ఇంటి, కొళాయి పన్నులను వసులు చేయడానికి సిద్ధమవుతున్నారు. బదిలీపై వచ్చిన అధికారులు గత సంవత్సరం పన్నులు వసులు చేయకపోవడం, కనీసం బిల్లు బుక్‌లను కూడా ముద్రించకపోవడం వారిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒకేసారి రెండు సంవత్సరాల బకాయిలను వసూలు చేయనున్నారు.

పడకేసిన అభివృద్ధి

స్వయం అభివృద్ధి సాధించడానికి ఏ పంచాయతీకి లేని వనరులన్నీ గన్నెవారిపల్లి పంచాయతీకి ఉన్నాయి. కానీ వనరులను సద్వినియోగం చేసుకుని నిధులను వసులు చేసి అభివృద్ధికి ఖర్చుచేయాల్సిన పాలక వర్గం, టీడీపీ నాయకులు ఎన్నికల్లో లాభం కోసం అభివృద్ధిని పణంగా పెట్టారు. ప్రధానంగా అదాయ వనరుగా ఉన్న గన్నెవారిపల్లి కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. పూర్తి స్థాయిలో రోడ్లు, కాలువలు లేవు. ఎక్కడ చూసినా మురుగు నిల్వ ఉంటోంది. దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతూ ప్రజలకు రోగాలు తెచ్చిపెడుతున్నాయి. అరకొరగా ఉన్న కాలువలు మురుగు వెళ్లడానికి ఉపయోగ పడటం లేదు.

నా దృష్టికి రాలేదు



పన్నుల బకాయిలు ఇంతవరకు నా దృష్టికి రాలేదు. పన్నుల వసులు బాధ్యత ఈఓ ఆర్‌డీదే. గన్నెవారిపల్లి పంచాయతీలో 2023–24కు సంబంధించి ఇంటి, కొళాయి పన్నులను ఎందుకు వసూలు చేయలేదో ఈఓఆర్‌డీని అడిగి చెబుతాను. గత ఏడాది పన్నులువసులు చేయకుంటే, ఈ ఏడాది రెండు సంవత్సరాలకు కలిపి వసూలు చేయాలని అధికారులను ఆదేశిస్తాం.

– రంగారావు, ఎంపీడీఓ

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన


వృద్ధులతో మాట్లాడుతున్న వైద్యులు

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి యాజమాన్యం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 24 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవిప్రసాద్, రవి కుమార్‌రెడ్డి, రంజిత్ కుమార్, ఇస్మాయిల్, కలశేఖర్ నాయుడు, జయరామిరెడ్డి, అల్లాబకాష్, మురళీకృష్ణ, రామమోహన్‌రెడ్డి, శేషానందరెడ్డి, ప్రసాద్, వికాష్ స్కూల్ రామకృష్ణ, శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు క్రాస్‌లో గురువారం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. తాడిపత్రి ప్రాంతంలో ద్వి చక్ర వాహనాల దొంగతనాలను నివారించడంలో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలదారులను హెచ్చరించి జరిమానా విధించారు.

వృద్ధాశ్రమంలో బెడ్ షీట్ల పంపిణీ


అగాపే వృద్ధాశ్రమ నిర్వాహకుడిని సత్కరిస్తున్న సీఐ ఈరన్న, పోలీసులు

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం సీఐ ఈరన్న ఆశ్రమంలోని బెడ్‌షీట్లు, బ్రెడ్లు, పండ్లూ పంపిణీ చేశారు. ఇటీవల యాడికి సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందజేస్తున్న సేవలను అభినందించి, నిర్వాహకుడు ప్రసాద్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రం తనిఖీ


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న గుత్తి ఏడీఏ వెంకటరాముడు

శింగనమల: మండలంలోని సి.బండమీదపల్లి వద్ద ఉన్న స్వర్ణభూమి ఫెర్టిలైజర్స్ ఆర్గానిక్ ఎరువుల తయారీ కేంద్రాన్ని గురువారం గుత్తి ఏడీఏ వెంకటరాముడు తనిఖీ చేశారు. ఆర్గానిక్ ఎరువుల తయారీ కేంద్రం లైసెన్స్, స్టాక్ రిజిష్టర్, ఎరువుల నిల్వ, ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డు ప్రకారం ఎరువుల స్టాక్‌ను లెక్కించారు. ఎరువుల నాణ్యతను ల్యాబ్‌లో పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను తయారీ చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట శింగనమల ఏఓ అన్వేష్‌కుమార్, వీహెచ్ఏ అమరేష్ ఉన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి రూ.40,930 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని పప్పూరు రోడ్డులో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లక్ష్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.40,930 నగదుతో పాటు మట్కా చీటీలను కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐలమ్మ


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, రజక సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: చాకలి ఐలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తికి ప్రతీక అని సీపీఐ నాయకులు కొనియాడారు. తెలంగాణ ధీరవనితి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం స్థానిక మహాత్మా గాంధీ సర్కిల్‌లో రజక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగయ్య, పట్టణ కార్యాదర్శి చిరంజీవియాదవ్, రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీరాములు, నాగరంగయ్య, రామాంజనేయులు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా మంజునాథ్



గుత్తి: గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా మంజునాథ్ యాదవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న గురునాథ్ శింగనమలకు బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మంజునాథ్ యాదవ్‌ను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. మంజునాథ్ యాదవ్‌కు దస్తావేఖరులు బండి సత్య, నరేష్ రాయల్, బండి నిరంజన్, రఘు, రంగస్వామి, ఈలూ, రమణ శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తి ఎస్ఐగా సురేష్

గుత్తి: గుత్తి పోలీసు స్టేషన్ నూతన ఎస్ఐగా సురేష్ నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న నబీరసూల్ బొమ్మనహాల్‌కు బదిలీ అయ్యారు. గుంతకల్లు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న సురేష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. రెండు రోజుల్లో సురేష్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఎస్‌కేసీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో పుస్తకాలు, కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో తోట నాగరాజు, తెలుగు వెలుగు సేవా సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, తరిమెల రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు చర్యలు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పనులకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జన చైతన్య నగర్ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళా సంఘాలకు రూ.62 లక్షల విలువ చేసే చెక్కులను రుణాలు మంజూరు చేశారు. కాలనీలో 14 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్లుకు భూమి పూజలు నిర్వహించారు. అదే విధంగా బీకేఎస్ పంచాయతీలో చెత్తను శుభ్ర పరుచుటకు మూడు ట్రాక్టర్లను మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, తహసీల్దార్ పుణ్యవతి, పసుపుల హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డి, ఎంపీడీఓ తేజోత్సు, స్పెషలాఫీసర్ శ్రీదేవి, ఏపీఎం నారాయణస్వామి, ఈఓఆర్డీ దామోదరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు తొలగించొద్దు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: అర్హుల పింఛన్లు తొలగించకూడదని సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీ రఘుద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనర్హుల పింఛన్లు తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు వేరే వారికి లింకు కావడం వల్ల అర్హులను అనర్హులుగా గుర్తుస్తున్నారన్నారు. అలాంటి వారి కోసం అన్‌లైన్ కాకుండా మాన్యువల్ పద్ధతిలో చెక్ చేయడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తిలక్‌నగర్‌లోని సరస్వతీ విద్యామందిరం సమీపంలో ఉన్న రైల్వే మోరీ విస్తరణకు పట్టణ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా విస్తరించే అవకాశం ఉందన్నారు. ఇందుకు రైల్వే అధికారుల అనుమతి అవసరం ఉండదని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి

పెద్దవడుగూరు: రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చిట్టూరు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సస్య రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పొలాల్లో ఆకులు ముడుతలు పడి కణువుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. సహజసిద్ధంగా లోపం కలిగిన నేలల్లో 2 గ్రాముల జింకు సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి రెండు లేదా మూడు సార్లు 5 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. అనంతరం పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్, జిల్లా ప్రతినిధి గిరి బాబు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సభ్యత్వం పెంచాలి


గార్లదిన్నెలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి రమ

గార్లదిన్నె/పామిడి: గ్రంథాలయంల్లో సభ్యత్వం పెంచాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రమ సూచించారు. గురువారం గార్లదిన్నె మండల కేంద్రంలోని లైబ్రరీని ఆమె పరిశీలించారు. ముందుగా లైబ్రరీలో రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రంథాలయంలో సభ్యత్వాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాల అధికారిని శిరీష, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమె పామిడి పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె గ్రంథాలయ రికార్డులను, పుస్తకాలను తనిఖీ చేశారు. మండలంలోని గ్రంథాలయ సెస్సు బకాయిలపై గ్రంథాలయాధికారిణి వెంకటలక్ష్మమ్మతో సమీక్షించారు.

అధ్వానంగా గుత్తి ఆర్‌ఎస్ రోడ్డు


అధ్వానంగా ఉన్న ఆర్‌ఎస్ రోడ్డులో వెళ్తున్న బస్సు

గుత్తి: గుత్తిలోని ఆర్‌ఎస్ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వచ్చిందంటే వాహనదారులు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా వీలు కానంత అధ్వానంగా రహదారులు మారాయి. ఎమ్మెల్యే ఇతర ఉన్నతాధికారులు తరుచూ ఆర్‌ఎస్ రోడ్డు మీదుగా వెళుతుంటారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులైనా చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం మండలంలోని జక్కలచెరువు గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. గుత్తి మున్సిపాలిటీతో పాటుగా మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుహాసిని, ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ శివాజీరెడ్డి, తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీటీసీ నారాయణ స్వామి, సీడీపీఓ ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

పెనకచెర్ల క్లినిక్‌కు నాణ్యతా సర్టిఫికెట్


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: మండలంలోని పెనక చెర్లలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌కు నాణ్యతా సర్టిఫికేట్ మంజూరు చేశారని వైద్యులు గౌతమి, దిలీప్ కుమార్, హనీషా తెలిపారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు క్లినిక్ పరిశుభ్రంగా ఉంచామన్నారు. ఈ ఏడాది ఆగస్టులో కేంద్ర నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు పెనక చెర్ల హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారన్నారు. ప్రజలకు అందుతున్న సేవలు రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఎర్రగుంట్ల డాక్టర్ దిలీప్‌కుమార్, హనీషా, సీహెచ్ఓ అరుంజ్యోతి, దుర్గ భవాని, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సత్కారం

యాడికి: మండల సబ్ రిజిస్ట్రార్ హనుమానాయక్ ఉరవకొండకు, సీనియర్ అసిస్టెంట్ హేమంత్ నాయుడు అనంతపురానికి, అటెండర్ రామాంజనేయులు పెనుగొండకు బదిలి అయ్యారు. దీంతో గురువారం యాడికి దస్తావేజులేఖరులు ఈశ్వరప్ప, రజాక్, నరేష్, రుక్కు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ప్రసాద్ బదిలీపై వెళ్తున్న వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

రోడ్డు, కల్వర్టు నిర్మించాలి

గుత్తి: రోడ్డు, కల్వర్టు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే రోడ్డు , కల్వర్టు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు చెర్నేపల్లి జగనన్న కాలనీ వాసులు గురువారం వినతి పత్రం అందజేశారు. జగనన్న కాలనీవాసులు గద్దల నాగేంద్ర, జగదీష్, షఫి, నరేష్ తదితరులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు సమస్యలు విన్నవించారు. ఇటీవల కురిసిన వర్షానికి జగనన్న కాలనీ జలమయం అయిందన్నారు. రాత్రంతా జాగారణ చేయాల్సి వచ్చిందన్నారు. వెంటనే రోడ్డు, కల్వర్టు నిర్మించాలని వారు విన్నవించారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

పామిడి: రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో ఏర్పాటు చేసిన డీలర్లు, ఎండీయూ, వాహనదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 1న నిర్వహించే రేషన్ సరుకుల పంపిణీ పగడ్బందీగా చేపట్టాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి సరుకులు అందజేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే డీలర్లపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీ నారాయణరెడ్డి, సీఎస్‌డీటీ అన్సర్, వీఆర్వోలు, డీలర్లు, ఎండీయూ వాహనదారులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో గురువారం ప్రిన్సిపాల్ మల్కీ బ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

ఘనంగా ఉరుసు

పామిడి: పట్టణంలోని షాదీఖానా ఆవరణలో గురువారం సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదని ఉరుసును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరుసు ప్రాంతంలోని అంగళ్లకు మంచి గిరాకీ లభించింది. రాత్రి ఖవ్వాలీ నిర్వహించారు. భక్తులు ఆనందోత్సాహాల నడుమ ఈ ఉరుసు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

తాడిపత్రి రూరల్: మండలంలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాస్ ఎడ్యుకేషన్ అండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథ్‌రెడ్డి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాప్తి నివారణ, చికిత్స, ముందు జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు.

నల్ల బెల్లం రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

యాడికి: నాటుసారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతడి నుంచి 25 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండల కేంద్రంలోని కోన రోడ్డు క్రాస్ వద్ద గురువారం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం సీతమ్మ తండా గ్రామానికి చెందిన ముడావత్ పీక్లా నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

విద్యావ్యవస్థను పటిష్ట పరచాలి

పెద్దవడుగూరు: విద్యా వ్యవస్థను పటిష్ట పరచాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతన విద్యా విధానం అమలు, పాఠశాలల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విధానంతో పాటు ఎండీఎం, టీఎమ్ఎఫ్ , ఎంఈఓ విజిట్‌ల గురించి వివరించారు. ఉపాధ్యాయులు మండలాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పశువుల అపహరణపై ఫిర్యాదు

పామిడి: మండలంలోని కాలాపురం గ్రామంలో నాలుగు మూగజీవాల అపహరణపై బాధిత రైతు రఘునాథ్‌రెడ్డి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం అర్ధరాత్రి ఇంటి ఆవరణంలో ఉన్న పాలు ఇచ్చే ఒంగోలు జాతికి చెందిన రెండు ఎనుములు, రెండు ఆవులను దుండగులు అపహరించారు. దీంతో జీవనాధారం కోల్పోవడంతోపాటు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పామిడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722,
9010588846, 9010223701